సాక్షి
అనంతపురం

గురువారం । 20 । మార్చి । 2025




చీనీ టన్ను రూ.27 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.27 వేలు పలికాయి.



325 మంది గైర్హాజరు

జిల్లాలో బుధవారం 135 కేంద్రాల్లో జరిగిన 'పది' సెకెండ్ లాంగ్వేజ్ పరీక్షకు 30,862 మంది విద్యార్థులకు గాను 30,537 మంది హాజరయ్యారు. 325 మంది గైర్హాజరయ్యారు.



న్యూస్‌రీల్

22న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు



అనంతపురం సిటీ: జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 22న నిర్వహించనున్నారు. అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలోని ప్రధాన, అదనపు సమావేశ భవనాల్లో సమావేశాలుంటాయి. ఆ రోజు ఉదయం 10 గంటలకు స్థాయీ సంఘం–1, 2, 4, 7(ఆర్థిక, ప్రణాళిక/ఇంజినీరింగ్ విభాగాలు/గ్రామీణాభివృద్ధి/ విద్య, వైద్యం) సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు. అదనపు సమావేశ భవన్‌లో స్థాయీ సంఘం –3, 5, 6(వ్యవసాయం/ఐసీడీఎస్/సాంఘిక సంక్షేమ శాఖలు) సమావేశాలు ఆయా చైర్ పర్సన్‌ల అధ్యక్షతన డిప్యూటీ సీఈఓ వెంకట సుబ్బయ్య నేతృత్వంలో జరుగుతాయి.

స్కూళ్లలో లాంగ్వేజ్ ఫెస్టివల్స్, సైన్స్, మ్యాథ్స్ క్లబ్స్

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో లాంగ్వేజ్ ఫెస్టివల్స్, సైన్స్, మ్యాథ్స్ క్లబ్స్ నిర్వహించనున్నట్లు డీఈఓ ఎం.ప్రసాద్ బాబు, సమగ్ర శిక్ష ఏపీసీ టి.శైలజ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 364 సెకండరీ, సీనియర్ సెకండరీ పాఠశాలల్లో లాంగ్వేజ్ ఫెస్టివల్స్, 198 సెకండరీ, 325 ఎలిమెంటరీ పాఠశాలల్లో సైన్స్ అండ్ మాథ్స్ క్లబ్స్ ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. లాంగ్వేజ్ ఫెస్టివల్స్ కోసం ఒక్కో పాఠశాలకు రూ. 500 చొప్పున రూ.1.82 లక్షలు, సైన్స్, మాథ్స్ క్లబ్స్ ఏర్పాటు చేయడానికి ఒక్కో పాఠశాలకు రూ. వెయ్యి చొప్పున రూ. 1.98 లక్షలు జమ చేశామన్నారు. సైన్స్, మ్యాథ్స్ క్లబ్స్ ఏర్పాటు చేయడానికి ఒక్కో పాఠశాలకు రూ. వెయ్యి చొప్పున రూ. 3.25 లక్షలు మండల విద్యాధికారులకు విడుదల చేసినట్లు వెల్లడించారు. మండల విద్యాధికారులు ఆ మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని, ప్రధానోపాధ్యాయులు లాంగ్వేజ్ ఫెస్టివల్స్ నిర్వహించి, సైన్స్ అండ్ మాథ్స్ క్లబ్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

మహిళ పట్ల అసభ్య ప్రవర్తన.. వ్యక్తికి ఆరు నెలల జైలు

అనంతపురం: మహిళను అవమానపరచడమే కాకుండా అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష పడింది. బుక్కరాయసముద్రం మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన కొండమ్మను అదే గ్రామానికి చెందిన ఓబుళరాజు 2019 మే 23న బహిరంగ ప్రదేశంలో అవమానించాడు. ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేసి ముద్దాయిని రిమాండ్‌కు పంపారు. కేసులో సాక్షులను బుధవారం అనంతపురం మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ సుజిన్ కుమార్ విచారించారు. నేరం నిరూపణ కావడంతో ముద్దాయి ఓబుళరాజుకు ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ. 4 వేల జరిమానా విధించారు. ముద్దాయికి శిక్ష పడేలా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి. శ్రీనివాసులు, సీఐ ఎం. కరుణాకర్, కోర్టు కానిస్టేబుల్ రమణను ఎస్పీ పి. జగదీష్ అభినందించారు.

ఊరూరా బారే !

- ఉరవకొండ నియోజకవర్గంలోని కూడేరు మండలం ఇప్పేరులో 1,100 ఓట్లు ఉంటాయి. ఇలాంటి చిన్న ఊర్లోనే 3 బెల్టుషాపులు నడుస్తున్నాయి. 24 గంటలూ మద్యం లభిస్తోంది.
- తాడిపత్రి నియోజకవర్గం పుట్లూరు మండల పరిధిలో ఎల్లుట్ల గ్రామం ఉంది. తక్కువ జనాభా ఉన్నా 2 బెల్టుషాపులు నిరంతరం నడుస్తూనే ఉంటున్నాయి.
- రాప్తాడు నియోజకవర్గం బండమీద పల్లెలో సుమారు 10 బెల్టుషాపులు ఏర్పాటయ్యాయి. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సొంత గ్రామం ఇది.



కళ్యాణదుర్గం మండలం మల్లాపురం గ్రామంలో ఇటీవల బెల్టుషాపు ప్రారంభించిన టీడీపీ కార్యకర్తలు



- మద్యం మత్తులో గ్రామాలు
- ప్రతి పల్లెలో రెండు లేదా మూడు బెల్టుషాపులు
- నియోజకవర్గ కేంద్రాల్లో వైన్‌షాపులకు అనుబంధంగా పర్మిట్‌రూములు
- మెజారిటీ షాపులు అధికార పార్టీ ఎమ్మెల్యేలవే..
- అనంతపురం అర్బన్‌లో బార్‌లను తలపిస్తున్న రూములు
- ఆరు మాసాల్లో జిల్లాలో రూ.444 కోట్లకు పైగా మద్యం అమ్మకాలు



బ్రహ్మసముద్రం మండలం పిల్లలపల్లి గ్రామం వద్ద బెల్టు షాపు వద్దకే టీడీపీ నాయకులు మద్యం సరఫరా చేస్తున్న దృశ్యం (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లాలో గ్రామాలు మద్యం మత్తులో మునిగి తేలుతున్నాయి. ప్రతి పల్లెలోనూ రెండు లేదా మూడు బెల్టుషాపులు ఏర్పాటయ్యాయి. వేళాపాళా లేకుండా 24 గంటలూ బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయిస్తున్నారు. దీంతో 20 ఏళ్ల యువకుడి నుంచి 70 ఏళ్ల వృద్ధుడి వరకూ మద్యం మత్తులోనే జోగుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో బెల్టుషాపులు లేకపోవడం, మద్యం షాపులకు కచ్చితమైన వేళలుండటం వల్ల పూర్తిగా నియంత్రణలో ఉండేది. ఇప్పుడు వైన్ షాపులకు పట్టపగ్గాలు లేవు. ప్రతి నియోజకవర్గంలోనూ ఎమ్మెల్యేలవే మద్యం షాపులు కావడం, బెల్టుషాపులు టీడీపీ కార్యకర్తలకే ఇవ్వడంతో ప్రశ్నించే అధికారి లేకుండా పోయారు.

అర్బన్‌లో పర్మిట్ రూములు..

పల్లెలన్నీ బెల్టుషాపుల కారణంగా మత్తులో జోగుతుంటే పట్టణాలు పర్మిట్ రూములతో తూగుతున్నాయి. వైన్‌షాపు ఉన్న ప్రతిచోటా పర్మిట్ రూము ఏర్పాటు చేసి అక్కడే తాగిస్తున్నారు. అనంతపురంలో జిల్లా ఎస్పీ ఇంటికి కూతవేటు దూరంలోనే పర్మిట్ రూము నడుస్తున్నా అడిగేవారు లేరు. అనంతపురం అర్బన్‌లో 30 వైన్ షాపులకు పైగా ఉంటే అన్ని చోట్లా పర్మిట్ రూములు ఏర్పాటయ్యాయి. ప్రతి రూమూ బార్‌ను తలపిస్తోంది.

అనంతపురం జిల్లాలో గడిచిన ఆరుమాసాల్లో మద్యం అమ్మకాలు ఇలా

సర్కిల్	అమ్మకాలు (రూ.కోట్లలో)
అనంతపురం	150.46
గుత్తి	43.96
గుంతకల్లు	43.15
కళ్యాణదుర్గం	27.37
కంబదూరు	09.38
కణేకల్లు	17.38
రాయదుర్గం	25.15
శింగనమల	42.16
తాడిపత్రి	59.05
ఉరవకొండ	26.76
మొత్తం	444.86

అర్ధరాత్రి తలుపు తట్టినా అనంతపురంలో ఓ నాయకుడి వైన్‌షాపు నుంచి మద్యం లభిస్తోంది. ఇక.. ఉదయం 10 గంటలకు తెరవాల్సిన మద్యం షాపులు రాప్తాడు, తాడిపత్రి లాంటి నియోజకవర్గాల్లో ఉదయం 8 గంటలకే తెరుస్తున్నారు.

భారీగా వినియోగం..

జిల్లాలోనే అనంతపురం అర్బన్‌లో ఎక్కువ మద్యం వినియోగమవుతున్నట్టు తేలింది. తాజా మద్యం అమ్మకాలు పరిశీలిస్తే 33 శాతం మేర ఈ నియోజకవర్గ పరిధిలోనే జరిగాయి. జిల్లాలో గత ఆరు నెలల్లో రూ.444.86 కోట్ల మద్యం విక్రయాలు జరిగితే ఒక్క అనంతపురం టౌన్‌లోనే రూ.150.46 కోట్ల వ్యాపారం జరిగింది. దీన్నిబట్టి ఇక్కడ పర్మిట్ రూముల ప్రభావం ఎలా ఉందో అంచనా వేయొచ్చు.

జిల్లాలో ఇలా..

మద్యం షాపులు	136
బార్‌లు	19
బెల్టుషాపులు	1,155
పర్మిట్ రూములు	70

కేజీబీవీ ప్రవేశాలకు వేళాయె

అనంతపురం ఎడ్యుకేషన్: అనాథ, పేద వర్గాల విద్యార్థినుల కోసం ఏర్పాటైన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలలో (కేజీబీవీ) 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈనెల 22 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సమగ్రశిక్ష ఏపీసీ టి.శైలజ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 31 కేజీబీవీల్లో 2025 – 26 విద్యా సంవత్సరానికి 6, 11 తరగతుల్లో ప్రవేశాలకు, 7, 8, 9, 10, 12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో ఈనెల 22 నుంచి ఏప్రిల్ 11 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్ (బడి మానేసిన వారు) పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మాత్రమే పరిగణలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. దరఖాస్తు https://apkgbv.apcfss.in/ సైట్ ద్వారా పొందాలన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందన్నారు. వివరాలకు 70751 59996, 70750 39990 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎంపీపీ, వైస్ ఎంపీపీ స్థానాలకు 27న ఎన్నికలు

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ కారణాలతో ఖాళీ ఏర్పడ్డ ఎంపీపీ, వైస్ ఎంపీపీ స్థానాలకు ఈ నెల 27న ఎన్నికలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఈఓ జి.వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ మేరకు బుధవారం రాత్రి రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి తమకు ఉత్తర్వులు వచ్చాయని వివరించారు. ఖాళీ అయిన రొద్దం, రామగిరి, గాండ్లపెంట, కంబదూరు, కణేకల్లు ఎంపీపీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఉరవకొండ, యల్లనూరు, పెద్దపప్పూరు, రాయదుర్గం వైస్ ఎంపీపీ స్థానాలకు అదే రోజు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.

రెండో విడత 62 గ్రామాల్లో రీ-సర్వే

- సర్వే, భూ రికార్డుల శాఖ ఏడీ రూప్లానాయక్

అనంతపురం అర్బన్: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గత ప్రభుత్వం చేపట్టిన రీ-సర్వే ప్రక్రియను ప్రస్తుత కూటమి ప్రభుత్వం కొనసాగిస్తున్న విషయం విదితమే. జిల్లావ్యాప్తంగా తొలిదశలో పైలెట్ ప్రాజెక్టుగా మండలానికి ఒక గ్రామం చొప్పున 31 మండలాల పరిధిలో 31 గ్రామాల్లో రీ-సర్వే చేపట్టారు. ఇదే క్రమంలో రెండో దశ కింద 62 గ్రామాల్లో రీ-సర్వే చేపట్టనున్నట్లు సర్వే, భూ రికార్డుల శాఖ ఏడీ రూప్లానాయక్ తెలిపారు. మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో 32 మండలాల్లో ఉన్న 503 గ్రామాలకు సంబంధించి 25,17,658.52 ఎకరాల రీ సర్వేకు గత ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంది. గ్రామాల్లో డ్రోన్లతో ఓఆర్‌ఐ (ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజ్) చిత్రాలను తీశారు. 499 గ్రామాలకు సంబంధించి ఓఆర్‌ఐలు సిద్ధంగా ఉన్నాయి. అదే క్రమంలో 198 గ్రామాల్లోని 5,88,615.626 ఎకరాల సర్వే పూర్తి చేశారు. మిగిలిన 305 గ్రామాల్లో రీ-సర్వే చేయనున్నారు.

అంతా పక్కాగా : గత ప్రభుత్వంలో భూముల రీ-సర్వే ప్రక్రియ పక్కాగా జరిగింది. 503 గ్రామాలకు గాను 198 గ్రామాల పరిధిలోని 1,83,353 భూ కమతాలకు సంబంధించి 5,88,615.626 ఎకరాలు సర్వే చేసి హద్దురాళ్లు ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో అధికారులు సభలను నిర్వహించగా, 1,83,353 భూ కమతాలకు గానూ 5,421 ఫిర్యాదులు (0.03 శాతం) మాత్రమే వచ్చాయి. దీన్ని బట్టి చూస్తే సర్వే పక్కాగా జరిగిందని అర్థమవుతోంది.



రీ సర్వే పనులను పరిశీలిస్తున్న జేసీ శివ్ నారాయణ్ శర్మ (ఫైల్)

గ్రామసభలు..: గత ప్రభుత్వం సర్వం సిద్ధం చేయడంతో పాటు 198 గ్రామాల్లో సర్వే కూడా పూర్తి చేసింది. దీంతో ప్రస్తుతం రీ-సర్వే సజావుగా జరగనుంది. ఆయా గ్రామాల్లో సభలు నిర్వహిస్తున్నారు.

రెవెన్యూ పనితీరు బాగుండాలి

- కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం అర్బన్: 'క్షేత్రస్థాయిలో రెవెన్యూ శాఖ పనితీరు బాగుండాలి. సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి. ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) అర్జీలు, ఇతర సమస్యల పరిష్కారంపై శ్రద్ధ పెట్టాలి' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. 'సాక్షి'లో ఈనెల 18న ''ప్రజా ప్రదక్షిణ వేదిక'' శీర్షికన ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్‌ఓ ఎ.మలోలతో కలిసి ఆర్డీఓలు, జిల్లా రిజిస్ట్రార్, తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, ఆర్ఎస్‌డీటీలు, ఎస్‌ఆర్‌ఓలు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు విశ్లేషించుకుంటూ పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీ సేవా సర్వీసెస్‌కు సంబంధించి పెండింగ్ ఉన్న అంశాలను పూర్తి చేయాలన్నారు. మ్యుటేషన్ ఫర్ కరెక్షన్, ట్రాన్సాక్షన్లు, ఏపీ డాటెడ్ ల్యాండ్ దరఖాస్తులు, రీవోక్ సర్టిఫికెట్లు, ఈ–పాస్ బుక్ సర్వీసెస్, మొబైల్ నెంబర్, పట్టాదార్ ఆధార్ సీడింగ్ దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలన్నారు. చుక్కల భూములకు సంబంధించి ఈనెల 29న కూడేరు మండలం, ఏప్రిల్ 5న బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 12న రాప్తాడు తదితర మండలాల పరిధిలోని దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్, ఆర్డీఓ, తహసీల్దారు కార్యాయాల్లో మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రహరీ, గేటు, నీటి సదుపాయం, మహిళలు, పురుషులకు మరుగుదొడ్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. సమావేశంలో ఎఫ్ఎస్ఓ రామకృష్ణారెడ్డి, ఎస్‌డీసీ తిప్పేనాయక్, సర్వేశాఖ ఏడీ రూప్లానాయక్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

'పది' కేంద్రాల్లో సమస్యలు తలెత్తకూడదు

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో చిన్న సమస్య కూడా తలెత్తకూడదని కలెక్టర్ వినోద్‌కుమార్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. అనంతపురం నగరంలోని శ్రీచైతన్య పాఠశాల పరీక్ష కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరీక్ష నిర్వాహణకు 135 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 30 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, 07 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 1,403 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు తాగునీటి వసతితో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలన్నారు. కలెక్టర్ వెంట డీఈఓ ప్రసాద్ బాబు, అనంతపురం అర్బన్ తహసీల్దార్ హరిబాబు తదితరులు ఉన్నారు.

రారండోయ్ వేడుక చూద్దాం

- నేడు ఖాద్రీ లక్ష్మీ నారసింహుడి బ్రహ్మ రథోత్సవం
- దేశంలోనే మూడవది, తెలుగు రాష్ట్రాల్లో పెద్ద రథం
- లక్షలాది మంది భక్తులు పాల్గొంటారని అంచనా

అర్చకుల వేదమంత్రాలు.. లక్షలాది మంది భక్తుల జయజయ ధ్వానాలు... బ్రహ్మదేవుడే సారథిగా మారి రథాన్ని నడిపే తీరు... ప్రహ్లాద సమేత కాటమరాయుడి వైభవం కనిన భాగ్యము. ఈ అపురూప ఘట్టానికి అంతా సిద్ధమైంది. కదిరిలో ఆధ్యాత్మిక భక్తజన తరంగం పోటెత్తుతోంది. బ్రహ్మాండనాయకుడైన ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మరథోత్సవానికి సర్వం సిద్ధమైంది.



ఉత్సవానికి సిద్ధమైన శ్రీవారి బ్రహ్మ రథం



బుధవారం రాత్రి ఐరావత వాహనాన్ని అధిష్టించిన శ్రీవారు

ఐరావత వాహనంపై వసంత వల్లభుడు

వసంత వల్లభుడిగా పేరు గాంచిన ఖాద్రీ లక్ష్మీ నారసింహుడు బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ఐరావతం (గజవాహనం)పై దర్శనమిచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగునున్న కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు ఐరావతంపై కాటమరాయుడి కమనీయ రూపాన్ని చూసి తరించారు. అనంతరం శ్రీవారు తిరిగి ఆలయంలోకి వెళ్లి పూజలందుకున్నారు.

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నారసింహుని బ్రహ్మ రథోత్సవానికి సర్వం సిద్ధమైంది. గురువారం ఉదయం 7.45 నుంచి 8.20 గంటల మధ్య అనూరాధా నక్షత్రంలో మేష లగ్న పుష్కరాంశంలో తేరును ప్రారంభించేందుకు ఆలయ అర్చక పండితులు శుభ ముహూర్తంగా నిర్ణయించారు. బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన ఉత్సవం ఇది. తేరుపై కాటమరాయుడి వైభవాన్ని కనులారా చూసేందుకు భక్తులు లక్షలాదిగా ఇప్పటికే కదిరికి చేరుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణంతో పాటు తిరు వీధుల్లోని భవనాలన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఆలయ ప్రాంగణంలో కాలు మోపేందుకు కూడా చోటు లేదు.

బ్రహ్మదేవుడే రథసారథి..

బ్రహ్మోత్సవాల్లో నారసింహుడు తిరు వీధుల్లో విహరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించడానికి దేవతలు తమ తమ వాహనాలను పంపుతారని భక్తుల నమ్మకం. శ్రీవారి రథోత్సవం నాడు సాక్షాత్తు బ్రహ్మదేవుడే రథాన్ని నడిపి స్వామి వారు విహరించడానికి సహకరిస్తారని, అందుకే బ్రహ్మ రథోత్సవం అంటారని ఆలయ ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు తెలిపారు.

దేశంలోనే మూడవ పెద్ద తేరు..

తమిళనాడు అండాల్ అమ్మవారి శ్రీవల్లి పుత్తూరు రథం, తంజావూర్ జిల్లాలోని తిరువార్ రథం తర్వాత దేశంలో అతి పెద్ద రథంగా కదిరి తేరు ప్రసిద్ధి చెందింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే అతిపెద్ద బ్రహ్మ రథం ఇదే. ఈ రథం సుమారు 540 టన్నుల బరువు, 37.5 అడుగుల ఎత్తు ఉంటుంది. రథంలోని పీఠం వెడల్పు 16 అడుగులు. 125 ఏళ్ల క్రితం తయారు చేసిన రథం చక్రాలు ఒక అడుగు, ఒక అంగుళం వెడల్పుతో పాటు 8 అడుగుల డయామీటర్‌తో ఉన్నాయి. రథంపై సుమారు 256 శిల్ప కళాకృతులను టేకుతో అందంగా చెక్కారు.

'అనంత'లో రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ల్యాబ్

అనంతపురం: జిల్లాలో రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ల్యాబ్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో తక్షణమే భూ సేకరణ చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉన్న జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాలయ పరిసరాల్లోని భూమిని, సెంట్రల్ వర్సిటీ అడ్మిన్ బిల్డింగ్ (జేఎన్‌టీయూ అనంతపురం స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్)ను కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ కంపెనీల భాగస్వామ్యంతో రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ల్యాబ్‌ను జిల్లాలో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. 24 గంటల్లో స్థల పరిశీలన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ (ఏ) వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు, సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎస్ఏ కోరి, ఆర్డీఓ కేశవనాయుడు, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పరిశీలించిన క్రిస్ప్ బృందం

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంగళగిరికు చెందిన క్రిస్ప్ బృందం సభ్యులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ మస్తానప్పతో సమావేశమై మాట్లాడారు. 2025–26 విద్యాసంవత్సరానికి గాను అప్రెంటిషిప్, ఎంబేడెడ్ డిగ్రీ ప్రోగ్రాంలో భాగంగా బీకాం కోర్సులో రిటైల్ ఆపరేషన్ అనే కొత్త కోర్సును ప్రవేశపెట్టే అంశంపై చర్చించిన అనంతరం విద్యార్థులకు అవగాహన కల్పించారు. మూడేళ్ల డిగ్రీ ప్రోగ్రాంలో భాగంగా రెండేళ్ల విద్యా బోధన, మూడో ఏడాది దేశంలోని ప్రసిద్ధ నగరాల్లో స్టయిఫండ్‌తో కూడిన అప్రెంటిషిప్‌ను అందజేస్తామన్నారు. కోర్సు పూర్తి కాగానే ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఈ అవకాశాన్ని బీకాం విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పాత బస్టాండ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



రాయదుర్గం టౌన్: స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న అన్నా క్యాంటీన్ వెనుక గుర్తు తెలియని వ్యక్తి (55) మృతదేహాన్ని స్థానికులు బుధవారం ఉదయం గుర్తించారు. సమాచారం అందుకున్న సీఐ జయానాయక్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రిలోని మార్చురీ గదికి తరలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో సామాజిక మాధ్యమాల్లో ఫొటోలను వైరల్ చేశారు. ఆచూకీ తెలిసిన వారు రాయదుర్గం పోలీసులను సంప్రదించాలని సీఐ కోరారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. కాగా, రెండు రోజులుగా సదరు వ్యక్తి ఆ ప్రాంతంలో సంచరిస్తున్నట్లుగా స్థానికుల ద్వారా తెలిసింది. అతిగా మద్యం సేవించడంతో పాటు వడదెబ్బకు గురై మృతి చెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి.

69 మంది వీఎస్‌ఏలకు పదోన్నతి

- టెక్నికల్ అసిస్టెంట్లుగా అవకాశం

అనంతపురం అగ్రికల్చర్: పట్టు పరిశ్రమశాఖ పరిధిలోని విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్స్ (వీఎస్‌ఏ)కు పదోన్నతి దక్కింది. సచివాలయ వ్యవస్థలో భాగంగా గత ప్రభుత్వం ఉమ్మడి జిల్లా పరిధిలో 152 మంది వీఎస్‌ఏలను నియమించింది. ఇందులో సీనియార్టీ, ఇతర నిబంధనల మేరకు 69 మందికి టెక్నికల్ అసిస్టెంట్లు (టీఏలు)గా పదోన్నతి కల్పిస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రెండు జిల్లాల పట్టుపరిశ్రమశాఖ అధికారులు పద్మమ్మ, ఆంజనేయులు బుధవారం వెల్లడించారు. ఇకపై వీరు పూర్తి స్థాయిలో పట్టుపరిశ్రమ పరిధిలోనే పనిచేస్తారన్నారు. పదోన్నతి పొందిన వారు ఒకట్రెండు రోజుల్లో ఎంపీడీఓ, అగ్రికల్చర్ ఆఫీసర్ల నుంచి నోడ్యూ సర్టిఫికెట్లు పొందిన తర్వాత పట్టుశాఖ ఏడీలను కలిసి నూతన విధుల్లో చేరాల్సి ఉంటుంది.

● గుక్కెడు నీటికీ కటకట!



గ్రామ శివారున కుళాయి వద్ద నీటిని పట్టుకుని తీసుకెళుతున్న యువతి

శింగనమల మండలంలోని నాగులగుడ్డం తండా గ్రామస్తులు దాహార్తితో అలమటిస్తున్నారు. గుక్కెడు నీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. వేసవి ఎండలు మండుతుంటే ప్రజల దాహార్తిని తీర్చడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే ఆరోపణలున్నాయి. గ్రామానికి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న దేవలచెరువులో బోరుబావి వేసి, అక్కడి నుంచి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే బోరుబావిలో నీటి లభ్యత తక్కువగా ఉండడంతో గ్రామ ప్రజల అవసరాలకు సరిపడా నీరు అందడం లేదు. దీంతో గ్రామాన్ని రెండుగా విభజించి ఓ వైపు ఒకసారి, మరో వైపు మరోసారి నీటిని వదులుతున్నారు. అది కూడా నీరు ఎప్పుడు వదిలేది స్పష్టత లేకపోవడంతో కుళాయిల వద్ద పడిగాపులు తప్పడం లేదు. గ్రామానికి ఆనుకుని ఉన్న గుట్టపై ట్యాంక్ నిర్మించి, కొత్తగా వేసిన బోరుబావికి అనుసంధానం చేయడం ద్వారా నీటి సమస్య తీరుతుందని ప్రజలు అంటున్నారు. కలెక్టర్ స్పందించి తమ తాగునీటి కష్టాలు తీర్చాలని వేడుకుంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



ముసలోళ్లకూ తప్పని తిప్పలు : బకెట్‌తో నీటిని పట్టుకుని వెళుతున్న వృద్ధురాలు



పడిగాపులు : తాగునీటి కోసం వేచి చూస్తున్న ప్రజలు



మళ్లీ వస్తాయో రావో.. : రెండు బిందెల్లో నీటిని పట్టుకుని వెళుతున్న తండా వాసి



ఇంటిల్లి పాది : నీటి సేకరణకు ఇంట్లోని అందరూ వెళ్లాల్సిందేనంటున్న గ్రామస్తులు

● అధినేతతో భేటీ



వైఎస్ జగన్‌ను సన్మానిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి, శింగనమల ముస్లిం నేతలు

శింగనమల: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో ఆ పార్టీ శింగనమల నియోజకవర్గ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిలో ప్రభుత్వ విద్య మాజీ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, శింగనమల మండల కో–ఆప్షన్ సభ్యుడు ఆలీబాషా, యూత్ మండల మాజీ కన్వీనర్ జెల్లి శ్రీనివాసులు, మత్స్యకార సంఘం అధ్యక్షుడు బెస్త వెంకటనారాయణ, వార్డు సభ్యుడు దావూద్, బంకు ఫక్రుద్దీన్, యువజన విభాగం నాయకులు భాస్కర్‌రెడ్డి, నాగవర్ధన్‌రెడ్డి, విద్యా కమిటీ మాజీ చైర్మన్ రఫీ, మండల మైనారిటీ నాయకుడు అబ్దుల్లా ఉన్నారు.

ఊర పిచ్చుక.. ఊరికే అందం

ఒక ఊరిలో పిచ్చుక కనిపిస్తే ఆ ఊరు పచ్చగా ఉన్నట్లు గ్రామీణులు ఓ అంచనా వేస్తుంటారు. పిచ్చుకలు కనిపిస్తున్నాయంటే ఆ ఊరిలో నీటి వనరులు సమృద్ధిగా ఉన్నట్లు.. పంటలు బాగా పండుతున్నట్లు భావిస్తారు. పంట చేలల్లో రైతులను ఇబ్బంది పెట్టే క్రిమికీటకాలను తింటూ ఎంతో మేలు చేస్తాయి. ఇంట్లో క్రిమికీటకాలు కనిపించాయంటే గుటుక్కున మింగేసి వాటిబారి నుంచి మనల్ని కాపాడతాయి. జీవ వైవిధ్యానికి ప్రతీకగా ఉండే పిచ్చుకల సంఖ్య నేడు గణనీయంగా తగ్గింది. ఈ క్రమంలో పిచ్చుకల జాతి పరిరక్షణకు ప్రపంచ వ్యాప్తంగా 2010 నుంచి ఏటా మార్చి 20న 'ప్రపంచ పిచ్చుకల దినోత్సవం' నిర్వహిస్తూ వాటి మనుగడ ఆవశ్యకతపై ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నారు. ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'సాక్షి' ప్రత్యేక కథనం.

సందర్భం
నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

అనంతపురం కల్చరల్: ఒకప్పుడు ఊర పిచ్చుకలు లేని ఊరులేదంటే అతిశయోక్తి కాదు. గ్రామీణ ప్రాంతాల్లో ఏ వాడ చూసినా, ఏ ఇల్లు చూసినా గుంపులు గుంపులుగా ఊరపిచ్చుకలు కనిపించేవి. మిగతా పక్షులకు భిన్నంగా ఊర పిచ్చుకలు, మానవులు ఒకే కుటుంబసభ్యులుగా కలిసి పోయేవారు. గుప్పెడు గింజలు వేస్తే చాలు కలకాలం తోడుండే పిచ్చుకలు నేడు వాతావరణంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, రేడియేషన్, శబ్ద కాలుష్యాల దెబ్బకు ఎక్కడికక్కడ రాలిపోతున్నాయి. దీంతో పర్యావరణాన్ని కాపాడే పిచ్చుకల జాతి సంరక్షణకు ప్రత్యేకంగా నడుం బిగించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

అంతరించిపోతున్న సంప్రదాయం

ఇంట్లో పిచ్చుకలు గూడు కట్టుకుంటే శుభం జరుగుతుందని పూర్వీకులు భావించి, వాటిని మురిపెంగా పిలుస్తూ ధాన్యాలను వెదజల్లేవారు. ఇళ్లు, ప్రార్థనా మందిరాల్లో పావురాలు, పిచ్చుకలు యథేచ్ఛగా సంచరించేవి. ఇప్పుడవన్నీ భూతద్దం పెట్టి వెతికినా కానరావు. రోజురోజుకూ పెరిగిపోతున్న మానవుడి స్వార్థం కారణంగా పచ్చని చెట్లు, చల్లటి వాతావరణం కనుమరుగవుతోంది. జిల్లాలో పంటల సాగులో రసాయనిక మందుల వినియోగం పెరిగిపోవడం కూడా పక్షి జాతి అంతరించేందుకు కారణమవుతోంది. ముఖ్యంగా సెల్‌ఫోన్ల వాడకం పెరిగిపోయే కొద్దీ పిచ్చుకల జాతి క్రమంగా అంతరించిపోతూ వస్తోంది. నానాటికీ తగ్గుతున్న పర్యావరణ సమతుల్యత పక్షి జాతిని నేటి తరానికి దూరం చేస్తోంది. ఇలాంటి తరుణంలో పిచ్చుకల సంరక్షణకు మేము సైతం అంటూ పలువురు ముందుకొస్తున్నారు. కృత్రిమ గూళ్లను ఉచితంగా అందిస్తున్నారు. మలమల మాడ్చేస్తున్న వేసవి నుంచి కాపాడుకునేందుకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పలు చోట్ల నీటి తొట్టెలను ఏర్పాటు చేశారు.



సోములదొడ్డి సమీపంలో పంట పొలాల విద్యుత్ తీగలపై సేద తీరుతున్న ఊర పిచ్చుకలు



పిచ్చుకల సంరక్షణకు కృత్రిమ గూళ్లను అందిస్తున్న ఏజీ అనిల్‌కుమార్‌రెడ్డి

ఊరంతా పిచ్చుక గూళ్లు

ఊర పిచ్చుకలకు మిగిలిన పక్షులకు చాలా తేడా ఉంటుంది. ఊర పిచ్చుకలు మనుషులతో సన్నిహితంగా మెలుగుతాయి. దీంతో ఒకప్పుడు ఊరంతా పిచ్చుక గూళ్లు కనిపించేవి. ఆహారం కోసం, నివాసం కోసం పూర్తిగా మానవులపై ఆధారపడతాయి. పొలాల్లో ఎగురుతూ పంట నష్టాలకు కారణమైన క్రిమికీటకాలను ఆరగిస్తాయి. పిచ్చుక చిన్నదే అయినా దాని ఉనికిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక జీవన విధానం పిచ్చుకల మనుగడకు ప్రతిబంధకం కారాదని పక్షి ప్రేమికులు అంటున్నారు. పిచ్చుకల సంరక్షణకు అనంతపురానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త ఏజే అనిల్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇందులో భాగంగా 1.40 లక్షల కృత్రిమ గూళ్లను ఇంటింటికి అందించి, పిచ్చుకల పునరుత్పత్తికి దోహదపడేలా చర్యలు తీసుకున్నారు. పిచ్చుకల విషయంలో ఆయన తీసుకున్న శ్రద్ధ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో అనంత ఖ్యాతిని పతాక స్థాయిలో మెరిసేలా చేసింది. పర్యావరణానికి దోహదపడే పిచ్చుకలను సంరక్షించుకోవడం అందరి బాధ్యత అని, ఆ దిశగా అందరూ ప్రయాణం సాగించాలని అనిల్‌కుమార్‌రెడ్డి పిలుపునిస్తున్నారు.

'పీఎస్‌హెచ్‌ఎంల సమస్యలు పరిష్కరించండి'



డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతి పత్రం ఇస్తున్న పీఎస్‌హెచ్‌ఎం అసోసియేషన్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు (పీఎస్‌హెచ్‌ఎం) ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పీఎస్‌హెచ్‌ఎం అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబును బుధవారం కలసి వినతిపత్రం అందజేశారు. పంచాయతీ ఆదర్శ పాఠశాలల్లో పీఎస్‌హెచ్‌ఎం పోస్టును కేటాయించాలని కోరారు. 117 జీఓ అమలుతో ఉన్నత పాఠశాలల్లో 3, 4, 5 తరగతులు విలీనమై, తప్పని పరిస్థితుల్లో ఇతర పాఠశాలలకు బదిలీ అయిన పీఎస్‌హెచ్‌ఎంలకు ఈ ఏడాది జరిగే బదిలీల్లో పాత స్టేషన్ నుంచి గరిష్ఠంగా 8 ఏళ్ల సర్వీస్ పాయింట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. పీఎస్‌హెచ్‌ఎం ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలన్నారు. డీఈఓను కలిసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షులు గోసల నారాయణస్వామి, ప్రధాన కార్యదర్శి రమణ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శులు పి. వెంకటరమణ, మర్రిస్వామి, ఆర్థిక కార్యదర్శి ఎ.ఈశ్వరయ్య, కార్యవర్గ సభ్యులు కమతం ఈశ్వరయ్య, మురళీ ప్రసాద్, జనార్దన రెడ్డి, రాజేంద్ర, గంగరాజు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో మాజీ వలంటీర్ ఆత్మహత్య



మహేంద్ర (ఫైల్)

గుత్తి: తల్లి ఆపరేషన్ కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక గ్రామ సచివాలయ మాజీ వలంటీర్ ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం గోరిమానుపల్లి గ్రామానికి చెందిన శ్రీరాములు, మణెమ్మ దంపతుల కుమారుడు మహేంద్ర గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆ గ్రామ సచివాలయ వలంటీర్‌గా పనిచేశాడు. ఆ సమయంలోనే తన తల్లికి శస్త్రచికిత్స అవసరం కావడంతో రూ.3 లక్షల వరకు అప్పులు చేశాడు. ఈలోపు రాష్ట్రంలో అధికారం మారి కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. వలంటీర్ వ్యవస్థను సీఎం చంద్రబాబు రద్దు చేయడంతో అప్పు ఎలా తీర్చాలో తెలియక మదనపడ్డాడు. వడ్డీ వ్యాపారుల ఒత్తిళ్లు తీవ్రం కావడంతో యాడికి మండలం బోయరెడ్డిపల్లి వద్ద ఉన్న పెన్నా సిమెంట్స్ పరిశ్రమలో పనిలోకి చేరాడు. ఈ క్రమంలోనే తమ అప్పు తీర్చాలంటూ వడ్డీ వ్యాపారుల నుంచి వేధింపులు తీవ్రమయ్యాయి. దీంతో దిక్కుతోచని మహేంద్ర (26) నాలుగు రోజుల క్రితం ఫ్యాక్టరీకి వెళుతున్నానని ఇంట్లో చెప్పి వచ్చాడు. అప్పటి నుంచి తిరిగి ఇంటికి వెళ్లలేదు. బుధవారం ఉదయం గుత్తి రైల్వేస్టేషన్‌కు చేరుకున్న మహేంద్ర...జీఆర్పీ స్టేషన్ ఎదుట అందరూ చూస్తుండగా రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వద్ద లభ్యమైన ఆధారాలను బట్టి ఆచూకీని గుర్తించిన జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప సమాచారంతో మహేంద్ర తల్లిదండ్రులు గుత్తికి చేరుకున్నారు. కుమారుడి మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. ఆర్థిక సమస్యలతోనే తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నట్లుగా ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

అనంతపురం అర్బన్: రైతాంగ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక రైతు సంఘం కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్పయాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కాటమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జునతో కలసి ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 15 నుంచి 17వ తేదీ వరకు తమిళనాడులోని నాగపట్నంలో అఖిల భారత్ కిసాన్ సభ (ఏఐకేఎస్) 30వ జాతీయ మహాసభలు ఉంటాయన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యాన రైతుల సమస్యలపై చర్చించేందుకు ఏప్రిల్ 8న అనంతపురంలో ఉద్యాన రైతుల రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రైతుల సంక్షేమంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాయలసీమ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా ప్రకటించాలన్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు గోవింద్, నాయకులు వన్నారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, రామకృష్ణ, నారాయణస్వామి, బండి రామకృష్ణ, వెంకట్రాముడు పాల్గొన్నారు.

లైనింగ్ పనులు ఆపకపోతే పోరుబాట తప్పదు

- ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి



పనులు ఆపాలంటూ కాంట్రాక్టు సిబ్బందికి సూచిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

ఆత్మకూరు: రైతులకు నష్టం చేకూర్చే హంద్రీ–నీవా కాలువ లైనింగ్ పనులు ఆపకపోతే పోరుబాట తప్పదని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. ఆత్మకూరు మండలం పంపరూరు తండా వద్ద హంద్రీ–నీవా కాలువను బుధవారం ఆయన పరిశీలించారు. యంత్రాల సాయంతో సాగుతున్న పనులను గమనించి అక్కడి కాంట్రాక్టర్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే పనులు ఆపాలని డిమాండ్ చేశారు. హంద్రీ–నీవా కాలువను వెడల్పు చేసే పనులతో పాటు పంట కాలువల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అలా కాదని రైతులకు నష్టం చేకూర్చేలా లైనింగ్ పనులు చేస్తామంటే కుదరదన్నారు. లైనింగ్ పనులు అడ్డుకునేందుకు ఎంతకైనా సిద్ధమని, అవసరమైతే యంత్రాలను పగులగొడతామని హెచ్చరించారు. రాయలసీమ జిల్లాల్లోని దాదాపు 6 లక్షల ఎకరాల ఆయకట్టుకు హంద్రీ–నీవా ప్రాజెక్టు ద్వారా నీరు ఇవ్వాల్సి ఉందని గుర్తు చేశారు. వెంటనే లైనింగ్ టెండర్లను రద్దు చేసి, కాలువను పదివేల క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యానికి వెడల్పు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు చంద్రిక, రామాంజినమ్మ, శివశంకర్ పాల్గొన్నారు.

తల్లి అంత్యక్రియలకు వెళితే.. ఇల్లు దోచేశారు



చోరీ ఘటనను వివరిస్తున్న బాధితురాలు హనీఫా

తాడిపత్రి: తల్లి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళ్లిన కుమార్తె ఇంటిని దుండగులు దోచేశారు. తాడిపత్రి మండలం బందార్లపల్లిలో ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన మేరకు... రెండు రోజుల క్రితం తాడిపత్రి మండలం వెంకటరెడ్డిపల్లి వద్ద ఆటో బోల్తా పడిన ఘటనలో తాడిపత్రిలోని భగత్‌సింగ్ నగర్‌కు చెందిన రసూల్‌బీ అనంతపురంలో చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రమాద విషయం తెలియగానే ఆమె కుమార్తె షేక్ హనీఫా ఇంటికి తాళం వేసి తన భర్తతో కలసి మంగళవారం రాత్రి అనంతపురంలోని సర్వజనాస్పత్రికి చేరుకుంది. బుధవారం తల్లి మృతదేహాన్ని తాడిపత్రికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. అనంతరం కుమార్తె హనీఫా తన స్వగ్రామం బందార్లపల్లికి చేరుకుంది. అప్పటికే ఇంటి తాళం పగులగొట్టి ఉండడం గమనించిన ఆమె ఆందోళనతో లోపలకు వెళ్లి పరిశీలించింది. బీరువాలోని బంగారు నెక్లెస్, లాంగ్ చైన్, కమ్మలు, కొంత నగదు చోరీకి గురైనట్లు గుర్తించి సమాచారం ఇవ్వడంతో తాడిపత్రి రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

'ఉపాధి' ఉద్యోగులకు నేడు బదిలీల కౌన్సెలింగ్

అనంతపురం టౌన్: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఉద్యోగులకు గురువారం బదిలీల కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ సలీంబాషా బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తు చేసుకున్న ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు గురువారం ఉదయం 10గంటలకు జరిగే కౌన్సెలింగ్ ప్రక్రియకు హాజరు కావాల్సి ఉంటుంది.

రిమాండ్‌కు ఆరుగురు విద్యార్థులు

అనంతపురం: నగరంలోని జీసెస్ నగర్‌లో ఉన్న ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థుల మధ్య చోటు చేసుకున్న లోకల్, నాన్ లోకల్ వివాదంలో చోటు చేసుకున్న ఘర్షణలో ఆరుగురు విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. అనంతపురం రెండో పట్టణ సీఐ శ్రీకాంత్ తెలిపిన మేరకు... డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ప్రవీణ్ కుమార్ నాయక్, మధుసూదన్‌లకు అదే కళాశాలలో డిగ్రీ మొదటి, రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు గణేష్, రామ్ చరణ్, జగదీష్, అనిల్ సాగర్ మధ్య లోకల్, నాన్ లోకల్ అంశంలో మనస్పర్థలు చెలరేగాయి. ఇటీవల అదే కళాశాల విద్యార్థి వినయ్ పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసుకున్న పార్టీలో జరిగిన గొడవను మనసులో పెట్టుకుని ప్రవీణ్ కుమార్ నాయక్, మధుసూదన్ ఉంటున్న వినాయక హాస్టల్‌లోకి మంగళవారం గణేష్, రామ్‌చరణ్, చందు, అనిల్, సాగర్, దామోదర్‌కుమార్, జగదీష్ అక్రమంగా ప్రవేశించారు. మధుసూదన్, ప్రవీణ్ నాయక్‌ను కొట్టుకుంటూ లాక్కొచ్చి ద్విచక్ర వాహనాలపై అపహరించారు. అనంతరం ఆలమూరు చెరువు చెక్‌డ్యాం వద్దకు తీసుకెళ్లి అక్కడ కట్టెలతో కొట్టి గాయపరిచారు. దాడికి సంబంధించి బాధిత విద్యార్థి మధుసూదన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం ఉదయం గణేష్, రామ్‌చరణ్, చందు, అనిల్‌సాగర్, దామోదర్ కుమార్, జగదీష్‌ను అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

కళింగరతో జాగ్రత్త

- రసాయనాలు వాడి ఎర్రగా ఆకర్షణీయంగా మార్చేస్తున్న దుస్థితి



ఆర్.శ్రీనివాసులు, జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి



మీ కోసం

అనంతపురం అగ్రికల్చర్: "మండు టెండ నుంచి ఉపశమనం పొందేందుకు ఎర్రగా కనిపిస్తూ నిగనిగలాడుతున్న కళింగర (పుచ్చకాయ), కర్బూజాలాంటివి తింటున్నారా? అయితే ముందు మీ ఆరోగ్యం గురించి కూడా కొంచెం ఆలోచించండి' అంటూ జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు (95812 75717) ప్రజలను హెచ్చరిస్తున్నారు. ఇటీవల కల్తీ, నాసిరకంతో పాటు విషపూరితమైన రసాయన మందులతో మాగబెట్టిన పండ్లు బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారన్నారు. ఇందులో కళింగర కూడా ఉందన్నారు. మరీ ముఖ్యంగా వేసవి దాహాన్ని తీర్చుకునేందుకు బహిరంగ మార్కెట్‌లో కుప్పలు కుప్పలుగా పోసి అమ్ముతున్న కళింగర కాయ సహజమైన రంగా లేదంటే కృత్రిమ రసాయనాలు కలిపిన పండా అనేది తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.

- పక్వానికి రాని కళింగరలను, ఎర్ర రంగు రాని వాటికి సిరంజిల ద్వారా కృత్రిమ రసాయనాలను ఎక్కిస్తున్నారు. రసాయనాలు ఎక్కించిన కాయ లోపలి భాగం మామూలు కన్నా మరీ ఎర్రగా ఉంటుందన్నారు. లేదంటే నిర్దిష్ట గడువు కంటే ముందుగానే మాగడం జరిగి ఉంటుందన్నారు. దీని వల్ల సహజంగా లభించే పోషకాలు అందక, అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుందన్నారు.
- సహజంగా పండిన కాయలో మృదువైన ఎరుపు లేదా గులాబీరంగు ఉంటుంది. అదే రసాయనాలు కలిపిన వాటిలో డార్క్ రెడ్, బ్లడ్ రెడ్ రంగులో ఉంటాయి. అంతేకాక ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తుంది. కళింగర కాయ కోసి ముక్కలు నీటిలో వేస్తే నీరు ఎరుపు రంగులోకి మారితే రసాయనాలు కలిపినట్లుగా నిర్ధారించుకోవచ్చు. అలాగే కాయ తిన్న తర్వాత చేతులకు ఎరుపు రంగు అంటి, అది తుడిచినా అలాగే ఉంటే రసాయనాలు కలిపినట్లు గుర్తించాలి. సహజంగా పండిన పుచ్చకాయ తీపిగా తేలికగా ఉంటుంది. కృత్రిమ రంగు వేసినది కొంచెం చేదు రుచి వస్తుంది.
- పుచ్చకాయ పైభాగం పచ్చగా ఉండాలి, మెరుస్తూ ఉండకూడదు. తక్కువ గ్రీన్ కలర్ ఉన్నదే మంచిదని గుర్తించాలి.
  కాయ నేలపై ఉండే భాగం పసుపు రంగులో ఉండాలి. అలాగే ఆకారంలో గుండ్రంగానూ, సమంగానూ ఉంటే మంచిది. ఎడమొడిగా ఉంటే బాగా లేదని అర్థం. కండ పట్టిన భాగం పచ్చగా ఉంటే ఇంకా పక్వానికి రాలేదని గుర్తు. పొడిగా, గోధుమ రంగులో ఉంటే పండిందని తెలుసుకోవాలి. కట్ చేసిన కాయ గాఢ ఎరుపు రంగులో ఉండకూడదు.
- రసాయనాలు కలిపిన పుచ్చకాయను తినడం వల్ల అలర్జీ, డయేరియా బారిన పడటమే కాకుండా దీర్ఘకాలంలో కాలేయం, కిడ్నీల సమస్య తలెత్త వచ్చు. క్యాన్సర్ రిస్క్ కూడా పెరుగుతుంది. ముఖ్యంగా చిన్నపిల్లలపై ఎక్కువ ప్రభావం ఉంటుంది.

క్లుప్తంగా

నాటుసారా నిర్మూలిద్దాం



మాట్లాడుతున్న డీపీఈఓ గోవిందనాయక్

చెన్నేకొత్తపల్లి: నాటు సారాను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి (డీపీఈఓ) గోవింద నాయక్ సూచించారు. చెన్నేకొత్తపల్లి ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గంగినేపల్లి దిగువ తండా, మేడాపురం గ్రామాల్లో బుధవారం నవోదయం 2.0 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి మాట్లాడుతూ.. నాటు సారాను తయారు చేయడం, విక్రయించడం నేరమన్నారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి తయారు చేసినా విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో రహస్యంగా నాటు సారా తయారు చేసిన లేదా విక్రయాలు జరుగుతున్నా వెంటనే హెల్ప్‌లైన్ నంబర్ 14405కు కాల్ చేయాలన్నారు. అనంతరం కళా బృందాలతో పాటల రూపంలో ప్రజలకు చైతన్యం కల్పించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ ఫరూక్ అజాం, ఎస్ఐ శివప్రసాద్ పాల్గొన్నారు.

ఈ–కేవైసీ వాయిదా వేయాలి

అనంతపురం అర్బన్: ఈ–కేవైసీ ప్రక్రియను కొద్ది రోజులు వాయిదా వేయాలని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రేషన్‌కార్డుల్లోని సభ్యులందరూ ఈనెల 20లోగా ఈకేవైసీ చేసుకోవాలంటూ ప్రభుత్వం గడువు విధించిందన్నారు. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాయన్నారు. పిల్లలు ఇతర ప్రాంతాల్లోని పాఠశాలలు, హాస్టళ్లలో ఉంటున్నారని తెలిపారు. ఈ క్రమంలో వారు వచ్చి ఈ–కేవైసీ చేసుకోవడం సాధ్యపడదన్నారు. ఏప్రిల్ 24 నుంచి విద్యార్థులకు వేసవి సెలవులు ఉంటాయన్నారు. ఈ–కేవైసీ విధానాన్ని ప్రస్తుతం వాయిదా వేయాలన్నారు. లేదా మే నెల వరకూ గడువు పొడిగించాలన్నారు. లేనిపక్షంలో ప్రజల తరఫున ఆందోళన చేపడతామన్నారు.

ఉగాది కవితలు ఆహ్వానం

అనంతపురం కల్చరల్: ఉగాది పర్వదినం సందర్భంగా ఔత్సాహికులైన కవుల నుంచి ఉగాది కవితలను ఆహ్వానిస్తున్నట్లు శ్రీకళాపీఠం ప్రతినిధి కంబదూరు షేక్ నబీరసూల్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 26వ తేదీ లోపు తమ కవితలను 9440722404 నంబర్‌కు పంపాలని సూచించారు. మన భాష, సంస్కృతీ సంప్రదాయాలు, దేశసమగ్రత, మతసామరస్యంతో పాటూ నేరస్తుల్లో కలిగే పశ్చాత్తాపం తదితర అంశాలపై కవితలు ఉండాలని పేర్కొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కురుగుంటకు చెందిన నాగరాజు అక్రమంగా మద్యం అమ్ముతున్నాడనే ఫిర్యాదుతో ఎస్ఐ రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం దాడి చేశారు. నాగరాజును అదుపులోకి తీసుకుని, 20 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పులు సురక్షితం



చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యాధికారి శివకృష్ణ

రాప్తాడు: ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పులు సురక్షితం. గర్భిణులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పులు చేయించుకోవాలని ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి శివకృష్ణ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున ఇద్దరు గర్భిణులకు వైద్య సిబ్బంది సుఖ ప్రసవం చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శివకృష్ణ ఇద్దరు చిన్నారులను పరీక్షించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. నార్మల్ డెలివరీ అయ్యేలా చూస్తామని పేర్కొన్నారు. హైరిస్క్ గర్భిణులకు అనంతపురంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. ప్రసవానికి ప్రైవేట్ ఆస్పత్రులకు వెళితే వేలాది రూపాయలు ఖర్చు అవుతుతాయని పేర్కొన్నారు.

బోధనేతర సిబ్బందికి పదోన్నతులు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలో పలువురు బోధనేతర సిబ్బందికి పదోన్నతులు కల్పించారు. వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ కృష్ణయ్య ఉత్తర్వులు జారీ చేశారు. బీఎస్ కృష్ణకుమారిని పిట్టర్-కం-వెల్డర్ నుంచి మేస్త్రీగా, పి.హర్షవర్ధన్ రెడ్డిని రికార్డు అసిస్టెంట్ నుంచి జూనియర్ అసిస్టెంట్‌గా, సి.పవన్ కుమార్‌ను క్లీనర్ నుంచి స్టీవార్డుగా, ఎస్.మారెన్నను ఆఫీస్ సబార్డినేట్ నుంచి రికార్డు అసిస్టెంట్‌గా, ఎస్.నరసింహుడును ఆఫీస్ సబార్డినేట్ నుంచి బ్లాక్ స్మిత్‌గా, ఎం.గోపీకి క్లీనర్ నుంచి అసిస్టెంట్ కుక్‌గా పదోన్నతి కల్పించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.మాధవి, డీఆర్‌లు మధుసూదన్ రెడ్డి, రంగా నాయక్, ఏఆర్ నాగభూషణ, జయకృష్ణ, రమేష్ గౌడ్, థామస్ పాల్గొన్నారు.

డ్రైనేజీ అస్తవ్యస్తం

- గంగలకుంటలో పడకేసిన పారిశుధ్యం
- రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



యల్లమ్మ దేవాలయం వెనుక సీసీ రోడ్డుపై నిలిచిన మురుగు

రాప్తాడు: రాప్తాడు పంచాయతీలోని గంగలకుంట గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. గ్రామంలో అక్కడక్కడ సీసీ రోడ్లు నిర్మించినా.. వాటికి డ్రైనేజీలు ఏర్పాటు చేయలేదు. మురుగు సీసీ రోడ్లపై ప్రవహిస్తోంది. డ్రైనేజీలో మురుగు ముందుకు కదలక పోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు వృద్ధి చెంది గ్రామంలో ఎక్కువ శాతం డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర జ్వరాలతో పాటు అతిసార వ్యాధుల బారిన పడుతున్నారు. కనీసం దోమల నివారణకు ఒక్కసారి కూడా ఫాగింగ్ చేపట్టిన దాఖలాలు లేవు. పంచాయతీల్లో ఫాగింగ్ యంత్రాలు నిరుపయోగంగా మారాయనడంలో ఎలాంటి సందేహం లేదు. పారిశుధ్యం మెరుగుపై అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అధికారులు పూర్తిగా వెనుకబడి ఉన్నారు.

అపరిశుభ్రతతో నరకం..

గంగలకుంటలో స్థానిక యల్లమ్మ దేవాలయం వెనుక ఉన్న బీసీ కాలనీలో బుల్లే పెద్ద నగేష్ ఇంటి ముందు ఉన్న సీసీ రోడ్డుపై మురుగు పారుతుండటంతో ఆ కాలనీ వాసులు నరకయాతన అనుభవిస్తున్నారు. సీసీ రోడ్డుపై పేరుకుపోయిన చెత్తతో దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతున్నాయి. ముఖ్యంగా పంచాయతీ అధికారులు డ్రైనేజీ వ్యవస్థను పట్టించుకోవడం లేదు. సీసీ రోడ్డుకు ఒక వైపే (తూర్పు వైపు) డ్రైనేజీ నిర్మించారు. మరొక వైపు (పడమర వైపు) నుంచి వచ్చే మురుగు కోసం డ్రైనేజీ నిర్మించలేదు. పడమర వైపు డ్రైనేజీ తీయాలంటే పడమర వైపు ఉన్నవాళ్లు కొందరు కాలువ వద్దని చెబుతున్నారు. దీంతో చేసేదేమీ లేక మురుగును సీసీ రోడ్డుపైనే అలాగే వదిలేశారు. సీసీ రోడ్డుపై పడమర వైపు డ్రైనేజీ తీసినా, సీసీ రోడ్డుపై అడ్డంగా చిన్న కాలువను తీసినా మురుగు ఆ కాలువ వెంబడి తూర్పు వైపు ఉన్న కాలువలోకి వెళ్తే సమస్య పరిష్కారం అవుతుంది. డ్రైనేజీ సమస్యను అటు అధికారులు కానీ ఇటు పాలకులు కాని పట్టించుకున్న పాపాన పోలేదు. మురుగు పోవడానికి అవకాశం లేకపోవడంతో ఎక్కువ కాలం సీసీ రోడ్డుపై మురుగు నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు ఇబ్బంది పడుతున్నారు. అలాగే తాగునీటిలో మురికి నీరు కలుస్తున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికలప్పుడు ఓట్ల కోసం వచ్చే రాజకీయ నాయకులు ఎన్నికలు పూర్తి కాగానే మా కాలనీల వైపు తిరిగి చూడటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో తీవ్ర తాగునీటి సమస్య నెలకొంది. పొలాల్లోకి వెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. సమస్యలను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. మరోవైపు గ్రామంలో వీధిలైట్లు లేకపోవడంతో గ్రామస్తులు రాత్రి 6 గంటలైతే బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. రాత్రి వేళల్లో విష పురుగులు సంచరిస్తున్నాయని చెబుతున్నారు. వీధిలైట్లు వేయించాలని సర్పంచుకు పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మా బాధలు ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు. కాలనీలో మా ఇంటి ముందున్న సీసీ రోడ్డుపై ఒక పక్క డ్రైనేజీ లేకపోవడంతో మురుగు రోడ్డుపైనే నిలుస్తోంది. మురుగు నీటి వలన దోమలు వృద్ధి చెంది రోగాలు వ్యాపిస్తున్నాయి. మురుగు నీటిలో పలువురు జారిపడిన సందర్భాలు ఉన్నాయి. నేను కూడా రెండు సార్లు జారి కింద పడ్డాను. అధికారులు మా గ్రామంలో పర్యటించాలి. సమస్యలు తెలుసుకుని, పరిష్కరించాలి.

– బాబా ఫక్రుద్దీన్, గంగలకుంట

ఎవరూ పట్టించుకోవడం లేదు



యల్లమ్మ దేవాలయం వెనక ఉన్న బీసీ కాలనీలోని సీసీ రోడ్డుపై మురుగు నిలుస్తోంది. మురుగు సమస్యను పరిష్కరించాలని అధికారులు, పాలకులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎవరైనా ఆలయానికి రావాలంటే మురుగు నీటిని తొక్కుకుని రావాలి. మురుగు నీటి సమస్య పరిష్కారం కోసం ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రాలు ఇచ్చాం. అయినా సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు నీటి సమస్యను పరిష్కరిస్తే వారికి రుణపడి ఉంటాం.

– బుడగ పెద్ద లింగమయ్య, గంగలకుంట

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న కమిషనర్ బాలస్వామి

అనంతపురం కార్పొరేషన్: ఇళ్ల నిర్మాణలు వేగవంతం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థలో ఎమినిటీస్‌తో ఆయన సమావేశం నిర్వహించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు చెందిన 2,535 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయడం జరిగిందన్నారు. బీసీ, ఎస్సీలకు రూ.50,000, ఎస్టీలకు రూ.75,000 మంజూరు చేసిందన్నారు. వివిధ దశల్లో నిర్మాణాలున్న లబ్ధిదారులకు ఈ విషయాన్ని తెలియజేయాల్సిన బాధ్యత ఎమినిటీస్‌పై ఉందని తెలిపారు. సమావేశంలో హౌసింగ్ డీఈ లక్ష్మీనారాయణమ్మ, ఏసీ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.


ఇద్దరికి మెమోలు

నగరపాలక సంస్థలో కమిషనర్ అధ్యక్షతన జరిగిన హౌసింగ్ సమావేశానికి పలువురు ఎమినిటీస్ గైర్హాజరయ్యారు. దీంతో అమినిటీస్‌కు కమిషనర్ బాలస్వామి మెమోలు జారీ చేశారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

నగరంలో పారిశుధ్యం మెరుగుకు పటిష్ట చర్యలు చేపట్టాలని పారిశుధ్య కార్యదర్శులను కమిషనర్ ఆదేశించారు. బుధవారం నగరంలోని ప్రధాన రోడ్లతో పాటు వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. కాలువల్లో పూడికతీత పనులు వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా నగర ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా నగరపాలక సంస్థ సిబ్బందికి అందజేయాలన్నారు. ఇంటింటా చెత్త సేకరణ పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. కంపోస్టు యార్డుకు చెత్తను తరలించాలన్నారు. అనంతరం మొదటి రోడ్డు శారద బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు.

పారదర్శకంగా ఓటరు జాబితా



మాట్లాడుతున్న ఈఆర్ఓ రామ్మోహన్

రాప్తాడు: నియోజకవర్గంలో ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించేలా చర్యలు చేపడుతున్నట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఈఆర్ఓ) రామ్మోహన్ తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు, సవరణలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్ఓ మాట్లాడుతూ.. ఓటర్ జాబితా కసరత్తుకు రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ఈ క్రమంలోనే ఎపిక్ కార్డులను ఆధార్‌కు అనుసంధానం చేసే ప్రక్రియను వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి నిబంధనలు, చట్టాల్లో అవసరమైన మార్పు, చేర్పులకు రాజకీయ పార్టీ నుంచి సూచనలు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఓటర్ నమోదు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని చెప్పారు. అలాగే నోటీసు ఇచ్చిన తర్వాతే మృతి చెందిన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు. రెండు నియోజకవర్గాల్లో ఓటుహక్కు కలిగి ఉన్నవారిని గుర్తించి, వెంటనే తొలగించాలని బీఎల్ఓలకు ఆదేశాలిచ్చినట్లు వివరించారు. పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. నియోజకవర్గంలో ఆయా గ్రామాలు, వార్డుల్లో ఓటరు జాబితాల్లో ఏమైనా సందేహాలుంటే వెంటనే ఎన్నికల డీటీని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ కుమారి, ఈడీటీ సువర్ణ, డీటీ చెన్నకేశవులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లు పంపిణీ చేస్తున్న స్పెయిన్ దేశస్తులు

కనగానపల్లి: మండలంలోని మామిళ్లపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థులకు బుధవారం ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో సైకిళ్లు పంపిణీ చేశారు. స్థానిక ఆర్డీటీ ఏరియా కార్యాలయంలో సంస్థ ప్రతినిధులు, దాతలు స్పెయిన్ దేశస్తులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 61 మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీటీ రీజనల్ కో-ఆర్డినేటర్ ప్రమీళ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో చదువుకునే పేద విద్యార్థులకు చేయూత అందించాలనే ఉద్దేశంతో స్పెయిన్ దేశస్తుల సహకారంతో ఆర్డీటీ సైకిళ్లు పంపిణీ చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏటీఎల్ పార్వతి, స్పెయిన్ దేశస్తులు జాకబ్, స్టెఫనో, యరా, పాఠశాల ఉపాధ్యాయులు శివారెడ్డి, జయచంద్ర, పీడీ శివారెడ్డి, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

హరిహర క్షేత్రం నిర్మాణానికి సన్నాహాలు

అనంతపురం కల్చరల్: శింగనమల మండలం నాయనిపల్లి క్రాస్ సమీపంలో హరిహర క్షేత్రం నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయి. బుధవారం అనంత ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు వివరాలు వెల్లడించారు. ప్రపంచంలోనే ఎత్తైన 300 అడుగుల మహాశివలింగం, 108 అడుగుల శ్రీమహావిష్ణువు విగ్రహం వీటి చుట్టూ అష్టాదశ శక్తిపీఠాలు నిర్మాణం కానున్నట్లు తెలిపారు. ఈనెల 21వ తేదీన ప్రపంచ ప్రసిద్ధి చెందిన స్థపతి (శిల్పులు)లు జిల్లా కేంద్రానికి విచ్చేస్తారని తెలిపారు. స్థానిక గీతామందిరంలో జరిగే సమావేశానికి అందరూ తరలి రావాలని ధర్మప్రచార మండలి అధ్యక్షుడు శ్రీపాద వేణు కోరారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయండి



జిల్లా అధ్యక్షుడు అనంతను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని మైనార్టీ నాయకులకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల మైనార్టీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఎస్.నియాజ్ అహ్మద్, కార్యదర్శిగా ఎస్.తబ్రేజ్ నియమితులయ్యారు. బుధవారం వారు పార్టీ అధ్యక్షుడు అనంతను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి, గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కూటమి ప్రభుత్వంలో సూపర్ సిక్స్ హామీలను విస్మరించిందన్నారు. మైనార్టీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఎస్.నియాజ్ అహ్మద్ మాట్లాడుతూ.. వైఎస్సార్ కుటుంబం మైనార్టీలకు పెద్దపీట వేసిందన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, నాయకులు కమర్‌తాజ్, రాజశేఖర్ రెడ్డి, దౌలా, మహబాషా, ఖాజా, తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



నూతనంగా ఎంపికైన గ్రామ కమిటీ సభ్యులు

రాప్తాడు: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, మండల కన్వీనర్ సాకే వెంకటేష్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని భోగినేపల్లి, పాలచెర్ల, గాండ్లపర్తి, జీ.కొత్తపల్లి తదితర గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సారథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వంపై ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడుదామన్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే వరకూ పోరాడదామన్నారు. కార్యక్రమంలో యూత్ కన్వీనర్ విశ్వనాథ రెడ్డి, బుక్కచెర్ల సొసైటీ మాజీ అధ్యక్షుడు కుర్లపల్లయ్య, మాజీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, మాజీ యూత్ కన్వీనర్ చిత్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మాచిరెడ్డి చెన్నారెడ్డి, సాకే చంద్ర, ఎల్ఐసీ వెంకట్రాముడు, కుమ్మర రాము, గుగ్గిళ్ల భాస్కర్ రెడ్డి, బుల్లే రామకృష్ణ, ఓబి రెడ్డి పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక



జట్టులో చోటు దక్కించుకున్న క్రీడాకారులు

అనంతపురం: ఈ నెల 20 నుంచి 21వ తేదీ వరకూ విజయవాడ వేదికగా జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రాతినిథ్యం వహించే జిల్లా జట్టును బుధవారం ఎంపిక చేశారు. అనంతపురం నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేపట్టిన ఈ ప్రక్రియను జిల్లా హ్యాండ్‌బాల్ చైర్మెన్ షేక్ రియాజ్ మహమ్మద్, జిల్లా కార్యదర్శి సాకే శివశంకర్ పరిశీలించారు. ఎంపికైన వారిలో ధనుష, గీతిక, సంధ్య, నిర్మల, మౌనిక, నందిని, హర్షవల్లి, మేఘన, మంజుల, మహేశ్వరి, మధుమతి, తేజస్విణి, ధనలక్ష్మి, హర్షప్రియ, ఇందు, లిఖిత ఉన్నారు.

భూకబ్జాపై చర్యలు తీసుకోవాలి

రాప్తాడు: దళితుల భూములను దేవుడి పేరుతో కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి కోరారు. బుధవారం తహసీల్దార్ విజయకుమారికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో హంపాపురం గ్రామంలో దళితుల భూములను మౌనగిరి క్షేత్రం పేరుతో కబ్జా చేశారన్నారు. మౌనగిరి క్షేత్రంలోని 39 అడుగుల అభయాంజనేయ స్వామి దేవాలయ నిర్మాణానికి పూజారి ఈశ్వరయ్య స్వామి దాదాపుగా 70 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోవడం దారుణమన్నారు. ఇప్పటికే నారాయణ స్వామి, రామకృష్ణ, అంజనేయులు, గంగమ్మ, వెంకటేశు, ఈశ్వర్ రెడ్డితో పాటు మరికొంత మంది పేదల భూములను ఆక్రమించుకుని బాధితులను బెదిరిస్తున్నారని తెలిపారు. చాలా చోట్ల దళితులు, గిరిజనుల భూములను కబ్జా చేయడం చూశామని.. దేవుడి పేరుతో కూడా కబ్జా చేయడం ఇక్కడే చూస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా ఆక్రమించుకున్న భూములను వదిలివేయాలని కోరారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎల్లన్న, రామాంజనేయులు, నగేష్, ఆంజనేయులు, నారాయణ స్వామి, ప్రసాద్, శివ తదితరులు పాల్గొన్నారు.

స్వీయ రక్షణ నైపుణ్యాలు అవసరం

అనంతపురం సెంట్రల్: ప్రతి ఒక్కరూ స్వీయ రక్షణ నైపుణ్యాలు అలవరచుకోవాలని అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న అన్నారు. అనంత ఆత్మ రక్షణ కార్యక్రమంలో భాగంగా జనవరి మూడో తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు వంద విద్యా సంస్థల్లో సుమారు 50 వేల మంది బాలికలకు సెల్ఫ్ డిఫెన్ స్కిల్స్, సేఫ్టీ అవేర్నెస్, సైకలాజికల్ ఎంపవర్మెంట్, ఓపెన్ ఫోరం ద్వారా నైపుణ్యాలను అందించే అనంత ఆత్మరక్షణ కొనసాగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో జిల్లాలో 495 పాఠశాలల్లో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో దాదాపు లక్ష మంది బాలికలకు స్వీయ రక్షణ నైపుణ్యాలు అందించడం శుభపరిణామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ఎం.నాగమణి, బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి, సమగ్రశిక్ష ఏపీసీ శైలజ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పదో తరగతి పరీక్షలు

రాప్తాడు: మండలంలో నాలుగు సెంటర్లలో బుధవారం జరిగిన హిందీ పరీక్షకు 1,034 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 1010 మంది హాజరయ్యారు. 24 మంది గైర్హాజరైనట్లు ఆయా సెంటర్ల చీఫ్, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఎంఈఓ మల్లికార్జున తెలిపారు. రాప్తాడు ఏపీ మోడల్ పాఠశాలలో 212 మంది గాను 210, ఆర్డీటీ అంధుల పాఠశాలలో 240 మందికి గాను 239, విన్సెంట్ డీపాల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 299 మందికి గాను 297, ఎల్లార్టీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 283 మంది విద్యార్థులకు 264 మంది పరీక్షలకు హాజరయ్యారు. సెంటర్ల వద్ద సీఐ శ్రీహర్ష ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

రేపు పప్పూరు రామాచార్యుల వర్ధంతి

అనంతపురం కల్చరల్: ఈనెల 21వ తేదీన స్వాతంత్ర్య సమరయోధుడిగా, శ్రీసాధన పత్రికా సంపాదకుడిగా సేవలందించిన పప్పూరు రామాచార్యుల వర్ధంతి నిర్వహిస్తున్నట్లు జాషువా అవార్డు గ్రహీత నాగలింగయ్య, యువకవి డాక్టర్ నానీల నాగేంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక జడ్జి బంగ్లా ఎదురుగా ఉన్న రామాచార్యుల విగ్రహానికి ఉదయం 10 గంటలకు కలెక్టర్ వినోద్ కుమార్, మేయర్ వసీం తదితరులు నివాళులర్పిస్తారని పేర్కొన్నారు.

యోగా సాధనతో ఆరోగ్యం



యోగా థెరపీలో పాల్గొన్న పతంజలి ప్రతినిధులు

అనంతపురం: యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం సాధ్యమని పతంజలి యోగా పీఠం శిక్షకుడు రిత్ దేవ్ బాబా అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకూ ఐదు రోజుల పాటు యోగా థెరపీ నిర్వహించారు. ఈ సందర్భంగా రిత్ దేవ్ బాబా మాట్లాడుతూ.. మనిషి శరీరం చేయగలిగే అత్యుత్తమ వ్యాయామాల్లో యోగా అత్యుత్తమైందన్నారు. వ్యాయామాల్లో యోగా ప్రథమ స్థానాన్ని సంపాదించడమే కాకుండా.. ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ఆదరణ పొందిందని పేర్కొన్నారు. క్రమంతప్పకుండా యోగా సాధన చేస్తే ఆరోగ్యకరమైన జీవితం సార్థకమవతుందన్నారు. కార్యక్రమంలో పతంజలి థెరపీ ప్రతినిధులు రవి, శర్మ, గోవింద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు వేతనాలు అందించాలి



ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నేతలు

ఆత్మకూరు: ఉపాధి హామీ కూలీలకు వేతనాలు అందజేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రానికి సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8 వారాలకు సంబంధించిన బిల్లులు చెల్లించకుంటే కూలీలు ఎలా జీవనం సాగిస్తారని ప్రశ్నించారు. పని చేసిన 15 రోజుల్లోపు బిల్లులు చెల్లించక పోతే పరిహారం ఇవ్వాలని చట్టం చెబుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పని ప్రదేశంలో కూలీలకు సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కూలీలకు అనుకూలమైన పనులు కల్పించి రోజు కూలీ రూ.600 వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శివశంకర్, సీపీఎం నేతలు పాల్గొన్నారు.